## క్లుప్తంగా

### 13న విద్యుత్‌శాఖ ఓసీ ఉద్యోగుల సమావేశం

**మదనపల్లె సిటీ:** విజయవాడలో ఈనెల 13న నిర్వహించే విద్యుత్‌శాఖ రాష్ట్ర స్థాయి ఓసీ ఉద్యోగుల సమావేశాన్ని జయప్రదం చేయాలని డివిజన్ ఓసీ విద్యుత్ ఉద్యోగుల అధ్యక్ష, కార్యదర్శులు జి.రామలింగారెడ్డి, శేషాద్రినాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ సమీపంలోని వీటీఎపీఎస్‌లో సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి నాయకులు, సభ్యులు హాజరు కావాలని కోరారు.

### థిల్లానా సాంస్కృతిక పోటీల లోగో ఆవిష్కరణ

**మదనపల్లె సిటీ:** థిల్లానా ది మెగా ఫెస్ట్ ఆఫ్ టాలెంట్ పోటీల లోగోను సోమవారం నిర్వాహకులు వెంకటేష్ ఆవిష్కరించారు. ఈనెల 13వతేదీన స్థానిక చౌడేశ్వరి కళ్యాణ మండపం నందు జరుగుతుందన్నారు.డ్యాన్స్, సింగింగ్, పెయింటింగ్, మెహందీ, షార్ట్‌ఫిలిమ్ విభాగాలలో పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్, మెడల్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అవకాశాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు దిలీప్‌మిట్టా, పునీత్ కుమార్, జస్వంత్, అంజి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

### శివాలయంలో వేడుకగా రుద్రహోమం

**పెద్దతిప్పసముద్రం:** స్థానిక శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో గ్రహణ దోష నివారణ కోసం సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు మణి కంఠ శర్మ, మంజునాథ్‌శర్మలు ఆలయంలో శివ లింగానికి పంచామృతాభిషేకం, ఏకవార రుద్రాభిషేకం, రుద్రహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేసి అన్నదాన సౌకర్యం కల్పించారు.

### పీలేరు ప్రాంతీయ ఆసుపత్రికి నూతన అంబులెన్స్



పీలేరుకు చేరుకున్న నూతన అంబులెన్స్

**పీలేరు :** పీలేరు ప్రాంతీయ ఆసుపత్రికి నూతన అంబులెన్స్ వచ్చినట్లు 108 అంబులెన్స్‌ల మేనేజర్ సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం పీలేరుకు చేరుకున్న నూతన అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 108 అంబులెన్స్ కంటే కొత్తగా వచ్చిన అంబులెన్స్ మరింత అధునాతన సౌకర్యాలు కలిగి ఉన్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ ప్రాణాలు రక్షించడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మనోజ్‌కుమార్‌రెడ్డి, 108 సిబ్బంది పాల్గొన్నారు.

### గురువులు సమాజ మార్గదర్శకులు

**పెద్దతిప్పసముద్రం:** సమాజంలో ఏ రంగంలో రాణించాలన్నా గురువుల పాత్ర కీలకమని, సమాజ మార్గదర్శకులు కూడా వారేనని ఎంఈఓలు నారాయణ, గౌస్‌పీర్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సోమవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా గురు పూజోత్సవం నిర్వహించారు. అనంతరం జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై అవార్డు అందుకున్న గుడ్డంపల్లి ప్రాథమిక పాఠశాల టీచర్ ఆంజినేయులును మండలంలోని ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది ఘనంగా సన్మానం చేశారు. అనంతరం ఉపాధ్యాయుడిగా ఆయన అందించిన సామాజిక సేవలు, పాఠశాలల అభివృద్ధిపై కొనియాడారు.

### పంటలకు ఎరువుల వాడకంపై అవగాహన

**ములకలచెరువు:** పంటలకు యూరియా వాడకంపై సోమవారం స్థానిక ఏఓ కార్యాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ స్రవంతి మాట్లాడుతూ డీఏపీ, యూరియా ఎక్కువగా వినియోగించడం వల్ల భూసారం క్షీణిస్తుందన్నారు. భూగర్భ జలాలపై ప్రభావం చూపుతుందన్నారు. వాగులు, వంకలు కలుషితం అవుతాయని వివరించారు. అలాగే పంటలకు చీడపీడల ఉధృతి పెరిగి పంట దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు. దీనివల్ల పంటలపై పెట్టే పెట్టుబడి పెరుగుతుందని, దీన్ని గమనించి రైతులు అధిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రీయ సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు.

### యూరియా పంపిణీ తనిఖీ

**నిమ్మనపల్లె :** మండలంలో యూరియా పంపిణీని సోమవారం అధికారులు తనిఖీ చేశారు. మండల ప్రత్యేక అధికారి సతీష్, ఎంపీడీవో రమేష్ బాబు, వ్యవసాయ అధికారి మంజుల మండలంలోని కొండయ్య గారిపల్లె, రెడ్డివారిపల్లె రైతు సేవా కేంద్రాలలో జరుగుతున్న యూరియా పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. రైతుసేవ కేంద్రాల పరిధిలోని రైతులు మాత్రమే వచ్చి యూరియా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో హేమాంబర్‌రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

# కాళ్లరిగేలా తిరుగుతున్నాం..కరుణించరా?

- పీజీఆర్ఎస్‌లో సబ్ కలెక్టర్‌కు బాధితుల మొర
- గ్రామసభలకు అధికారులు రాలేదని సర్పంచ్ ఫిర్యాదు
- ఆక్రమణదారుల నుంచి భూమిని కాపాడండి
- ముంపు భూములకు పరిహారం ఇప్పించండి



పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి

**మదనపల్లె రూరల్ :** సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చాలా కాలంగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లు అగిరేలా తిరుగుతూనే ఉన్నాం. మా సమస్యలు మీరైనా పరిష్కరించండి అంటూ అర్జీదారులు సబ్ కలెక్టర్ చల్లా కల్యాణిని వేడుకున్నారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాల ప్రజలు తమ సమస్యలపై సబ్ కలెక్టర్ చల్లా కల్యాణికి అర్జీలు సమర్పించారు. తమ ఆవేదనను వినిపించారు.

**ఆక్రమణదారుల నుంచి భూమిని కాపాడండి**

అంగళ్లు గ్రామం చేనేతనగర్ సర్వేనెం.111/7 భూమిలో పడమరవైపున కాకర్ల విశ్వనాథ్, గంగులప్పలు దౌర్జన్యంగా ప్రవేశించి హక్కులు, పత్రాలు లేకున్నను ఇనుపగేట్లు, కంచెలు ఏర్పాటుచేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని గొల్లపిన్ని వెంకటసుందరప్ప కుమారులు కృష్ణమూర్తి, చంద్రశేఖర శర్మ, నటరాజు, సుదర్శన, రవీంద్రబాబులు ఫిర్యాదుచేశారు. సర్వేనెం.111/7లోని 3.90 ఎకరాల్లో 2007లో అప్పటి సబ్ కలెక్టర్ స్మితాదాస్ ఆదేశాల మేరకు బలహీనవర్గాల ఇళ్ల నిర్మాణానికి 1.50 సెంట్లు ఇచ్చేశామన్నారు. మిగిలిన 2.30 ఎకరాల భూమిని ఇతరులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దీనిపై సర్వేచేసి ఆక్రమణలు తొలగించాల్సిందిగా పలుమార్లు కోరినా పట్టించుకోలేదన్నారు. మిగులుభూమికి హద్దులు చూపించి దురాక్రమణను అరికట్టాల్సిందిగా కోరారు.

**గ్రామసభకు అధికారులు రావడం లేదు**

పోతబోలు పంచాయతీలో నిర్వహిస్తున్న గ్రామసభలకు అధికారులు రాకపోవడంతో సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోతున్నాయంటూ సర్పంచ్ ఈశ్వరయ్య ఫిర్యాదుచేశారు. గ్రామసచివాలయంలో సిబ్బంది సక్రమంగా పనిచేయడం లేదని, సబ్ కలెక్టర్ హోదాలో సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరారు.

**బస్టాప్ స్థలాన్ని ఇతరులకు కేటాయించవద్దు**

నిమ్మనపల్లె మండలం వెంగంవారిపల్లె గ్రామంలోని 810/13 లెటరులోని ప్రభుత్వస్థలాన్ని బస్‌స్టాప్‌గా విద్యార్థులు, ప్రజలు వినియోగిస్తున్నామని, ప్రస్తుతం ఆ స్థలాన్ని స్థానిక వీఆర్వో ఇతరుల పేరుతో పట్టా ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని, గ్రామప్రజల సౌకర్యం దృష్ట్యా స్థలాన్ని బస్‌స్టాప్‌గానే ఉంచాల్సిందిగా గ్రామస్థులు అర్జీ సమర్పించారు. పదేళ్లుగా బస్‌స్టాప్‌గా వినియోగిస్తున్న స్థలాన్ని ఒకవేళ ఇతరులకు పట్టా ఇచ్చినట్లయితే, రద్దుచేయాల్సిందిగా వినతిపత్రం సమర్పించారు.

**ముంపు భూములకు పరిహారం ఇవ్వండి**

తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె జొన్నచేనుపల్లె దబ్బలగుట్టపల్లె ప్రాజెక్టు నిర్మాణంలో ముంపుకు గురైన భూములకు సంబంధించి నష్టపరిహారం అందలేదని, పలుమార్లు అర్జీలు సమర్పించినా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్థుడు వెంకటరమణారెడ్డి ఫిర్యాదు చేశాడు.

# మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలి

ఏపీయూఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ



మాట్లాడుతున్నఏపీయూఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసత్యనారాయణ

**మదనపల్లె సిటీ:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ,ఉపాధ్యాయ,పెన్షనర్ల వేతన సవరణ కమిటీ ఏర్పాటు చేసి వెంటనే పెరిగిన ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతి, చెల్లించాల్సిన 4 డీఏలను వెంటనే ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం మదనపల్లె పట్టణంలోని పలు పాఠశాలు సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు చెల్లించాల్సిన రూ.25 వేల కోట్ల బకాయిలలో కేవలం సుమారు ఆరు వేల కోట్లు మాత్రమే చెల్లించిందన్నారు. ఉపాధ్యాయులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ సొమ్ము అవసరం మేరకు మంజూరు చేయడం లేదన్నారు. పెన్షనర్ల గ్రాట్యుటీ సంపాదిత సెలవు నగదు మంజూరు తీవ్ర కాలయాపన జరుగుతున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకుపోయినప్పటికి ఎటువంటి చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వు 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయడం, జూనియర్ కాలేజీ అధ్యాపకులుగా 40 శాతం పంచాయతీరాజ్ ప్రభుత్వ ఉపాధ్యాయుల పదోన్నతి కల్పించడం, డిఓ పుల్‌లోని బాషా పండితులు, పీఈటీల ప్రమోషన్లు, ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంతో పాటు మాతృభాషలో విద్యాబోధన, హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో రెగ్యులర్ ప్రాతిపదికన పీజీటీ నియామకాలు చేపట్టడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందని దీనిపై సీఎం కల్పించుకుని ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మధుమతి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, భీమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నాయకులను వేధించడమే కూటమి ప్రభుత్వ పని





ఎంపీ మిథున్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డితో నాయకులు

**పీలేరు :** వైఎస్సార్‌సీపీలో ప్రముఖ నాయకులను వేధించడమే కూటమి ప్రభుత్వం పనిగా పెట్టుకుందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మధ్యంతర బెయిల్‌పై హైదరాబాద్ చేరుకున్న రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని సోమవారం పీలేరు మాజీ ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిసి ఎంపీని కలసి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్రమ మద్యం కేసు ఎన్నో రోజులు నిలబడదని, ఈ కేసు నుంచి ఎంపీ కడిగిన ముత్యంలా బయటపడుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వంగా అక్రమ మద్యం కేసు తోపాటు పలు అక్రమ కేసులు వైఎస్సార్‌సీపీ నేతలపై బనాయించినా ధర్మమే గెలుస్తుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే తోపాటు నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఆనందరెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, గజ్జెల శీన్‌రెడ్డి, గజ్జెల శృతి, భానుప్రకాష్‌రెడ్డి, చక్రదర్, పి. ద్వారకనాథరెడ్డి, ఇక్బాల్‌అహ్మద్, హనీఫ్, వెంకటపతి, సునీల్‌రెడ్డి, బుల్లెట్ శేఖర్, వినోద్ గౌడ్, విక్టరీ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మిథున్‌రెడ్డిని కలిసిన నేతలు**

**మదనపల్లె:** మద్యం అక్రమ కేసులో మధ్యంతర బెయిల్ పొంది హైదరాబాద్‌లో ఉన్న రాజంపేట పార్లమెంటు సభ్యులు పీవీ.మిథున్‌రెడ్డిని సోమవారం తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాలకు చెందిన ఆ పార్టీ నేతలు కలిశారు. సీనియర్ నాయకులు కొండా సిద్దార్థ, రవిచంద్రారెడ్డి, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ ఎస్ఏ.కరీముల్లా తదితరులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అక్రమ కేసులతో వైఎస్సార్‌సీపీ నేతలను వేధించడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు.

# అక్షరాస్యతతోనే పేదరిక నిర్మూలన



అక్షరాస్యతపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

**మదనపల్లె రూరల్ :** పేదరికాన్ని తగ్గించడం, లింగ సమానత్వాన్ని సాధించడం అక్షరాస్యతతోనే సాధ్యమని ఎంపీడీఓ తాజ్ మస్రూర్ అన్నారు. సోమవారం 69వ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా అన్నమయ్యజిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలంలోని వెంకటేశ్వరపురం ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అక్షరాస్యత ప్రాముఖ్యతను తెలుపుతూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ తాజ్ మస్రూర్ మాట్లాడుతూ... దేశం పురోగతి చెందుతున్నప్పటికీ లక్షలాది మంది ప్రజలు నేటికీ అక్షరాస్యతకు దూరంగానే ఉన్నారన్నారు. ముఖ్యంగా మహిళలు, అణగారిన వర్గాల వారికి ప్రాథమిక అక్షరాస్యత అందుబాటులో లేని పరిస్థితులు ఉన్నాయన్నారు. అక్షరజ్ఞానం అనేది అజ్ఞానాన్ని తరిమికొట్టి, విజ్ఞానాన్ని అందిస్తుందన్నారు. అక్షరమే నేటి సమాజంలోని అన్ని రుగ్మతలకు ఆయుధంగా పేర్కొన్నారు. సమాజం సంపూర్ణ అభివృద్ధి అక్షరంపైనే ఆధారపడి ఉందన్నారు. చదువులేని వాడు వింతపశువు అన్నట్లు సమాజంలో పరిపూర్ణ మానవుడుగా మారాలంటే అక్షరంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, అడల్ట్ ఎడ్యుకేషన్ నోడల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, హెచ్ఎం రమణమ్మ, వయోజన విద్యాశాఖ సిబ్బంది విశ్వనాథరెడ్డి, మాధవీలత, రాజా పాల్గొన్నారు.

### 15వ ప్రణాళిక సంఘం నిధులు విడుదల

**తంబళ్లపల్లె:** మండలానికి 15వ ఆర్థిక ప్రణాళిక సంఘం నిధులు రూ.1.01 కోట్లు విడుదలైనట్లు ఎంపీడీఓ థామస్ సోమవారం తెలిపారు. బాలిరెడ్డిగారిపల్లె పంచాయతీకి రూ.5,78,255, దిగువపాలెం రూ.5,36,326, ఎద్దులవారిపల్లె రూ3,28,157, ఎగువసుగాలితాండా రూ.2,95,952, గంగిరెడ్డిపల్లె రూ.4,09,618, గోపిదిన్నె రూ.7,08,496, గుండ్లపల్లి రూ.5,23,679, కన్నెమడుగు రూ.3,80,404, కోసువారిపల్లె రూ.9,43,224 విడుదలయ్యాయన్నారు. అలాగే కోటకొండ రూ.4,53,040, కొటాల రూ.3,58,841, కుక్కరాజుపల్లి రూ.3,70,297, మద్రిమాకులపల్లె రూ.3,10,504, పంచాలమర్రి రూ.2,38,684, పరసతోపు రూ.7,85,331, ఆర్ఎన్ తాండా రూ.5,44,719, రెడ్డికోట రూ.3,55,285, రేణుమాకులపల్లె రూ.5,75,739, తంబళ్లపల్లె రూ.9,49,647 ,ఎర్రసానిపల్లె రూ.2,07,065, జుంజురపెంట రూ.2,97,946 విడుదలైనట్లు తెలిపారు.

### 16న మండల మీట్

**తంబళ్లపల్లె:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 16న ఉదయం 11 గంటలకు ఎంపీపీ అనుసూయమ్మ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ థామస్ ఒక ప్రకటనలో తెలిపారు.

# యూటీఎఫ్ రణభేరి జయప్రదం చేయండి

**పీలేరు :** ఈ నెలా 15 నుంచి 19వ ఏదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగనున్న యూటీఎఫ్ రణభేరి జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్, కోశాధికారి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం పీలేరులో యూటీఎఫ్ రణభేరి పోస్టర్లు ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిర్వహించే రణభేరి కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ గౌరవాధ్యక్షులు రాధాకృష్ణ, జిల్లా కౌన్సిలర్ వెంకటరమణ, చిన్నరెడ్డెప్ప, విజయకుమార్, పీరయ్య, ఆదినారాయణ, కామేశ్వర తదితరులు పాల్గొన్నారు.

# మదనపల్లెను జిల్లాగా ప్రకటించాలి

–సాధన సమితి సమావేశం డిమాండ్



వివిధ సంఘాలు, పార్టీల నేతల సంఘీభావం

**మదనపల్లె:** చంద్రబాబు, లోకేష్‌లు ఇచ్చిన హామీ మేరకు మదనపల్లె జిల్లా ఏర్పాటు చేయాలని జిల్లా సాధన సమితి డిమాండ్ చేసింది. సోమవారం రాజకీయ పార్టీలు, సంఘాలతో జరిగిన సమావేశంలో వక్తలు ఈ మేరకు తమ అభిప్రాయాలను వెల్లడించారు. రాష్ట్ర భౌగోళిక అంశాలకు సంబంధించి ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం ఇప్పటివరకు మదనపల్లెలో పర్యటించకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. రాజంపేట జిల్లాపై చర్చ జరుగుతున్న దృష్ట్యా మదనపల్లెకు అన్యాయం జరక్కుండా చూడాల్సి వుందన్నారు. దీనిపై సంఘాన్ని కలిసి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించారు. జిల్లా కోసం జరిగిన ఆందోళనలపై నమోదైన కేసుల విషయంలో ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. జనసేన రాయలసీమ కో కన్వీనర్ జి.రాందాస్ చౌదరి మాట్లాడుతూ మదనపల్లె జిల్లా ఏర్పాటుపై ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. బహుజన సేన అధ్యక్షులు శ్రీచందు, కాంగ్రెస్, టీడీపీ, జనసేన, సీపీఐ, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు సురేంద్రయాదవ్, అనిత, మనోహర్‌రెడ్డి, షేక్ రెడ్డి సాహెబ్, కృష్ణప్ప, రెడ్డిబాషా, శ్రీరాములు, లలితమ్మ, కరీముల్లా, క్రిష్టఫర్, దివాకర్, మాధవ్, ముబారక్, నూర్ ఆలామ్ పాల్గొన్నారు.

# పేదలకు వైద్యవిద్యను దూరం చేసేందుకే పీపీపీ



మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణపై నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

**మదనపల్లె రూరల్ :** పేద విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేసేందుకే కూటమిప్రభుత్వం పీపీపీ విధానాన్ని తీసుకువస్తోందని ఏఐఎస్ఎఫ్ అన్నమయ్యజిల్లా కార్యదర్శి కే.మాధవ్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ మదనపల్లె నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో సోమవారం సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ...పీపీపీ పేరుతో మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలనుకోవడం దారుణమైన చర్య అన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీలు నిర్వహిస్తే పేదలకు, ప్రతిభ కలిగిన విద్యార్థులకు మెడికల్ సీట్లు లభిస్తాయన్నారు. ప్రైవేట్ యాజమాన్యంలో సంపన్నులకు సీట్లు లభించడంతో వైద్య విద్య వ్యాపారంగా మారిపోతుందన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో మెడికల్ కాలేజీల్లోని రిజర్వేషన్ సీట్లలో సగం సీట్లను లక్షలకు అమ్ముకునే జీఓ.107, 108లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో తీసుకురావాలన్న ఆలోచనను కూటమిప్రభుత్వం విరమించుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భవిత, సాయికిరణ్, నవ్యశ్రీ, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా సరఫరాలో కూటమిప్రభుత్వం విఫలం



ములకలచెరువు: ఏఓ కార్యాలయం ఎదుట నిరసన

**మదనపల్లె రూరల్ :** రైతుల పంట పొలాలకు అవసరమయ్యే యూరియాను రైతులకు అందించడంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి కృష్ణప్ప, కార్యవర్గసభ్యులు సాంబశివ అన్నారు. సోమవారం సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శనలో భాగంగా వారు మాట్లాడుతూ...ఎరువుల కొరతను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ వ్యాపారస్థులు బ్లాక్ మార్కెట్‌లో అధికరేట్లు పెంచి సొమ్ములు చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి రైతుసేవా కేంద్రాల ద్వారా ఎరువులు అందజేయాలని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మురళీ, మండల కార్యదర్శి రెడ్డిశేఖర్, మాధవ్, దేవా, తిరుమల, మోహన్, ఎండపల్లి వెంకటరమణ, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**సీపీఐ నిరసన**

**ములకలచెరువు:** రైతులకు యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ఎరువులు కావాల్సినంత అందుబాటులో ఉంచాలని, బ్లాక్ మార్కెటింగ్ చేసే డీలర్లపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 20 రోజులుగా డీఏపీ, యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి ఎరువులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమస్యపై ఆందోళనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున, అంజనప్ప, గంగులప్ప, జయకర్, రెడ్డెప్ప, రైతులు పాల్గొన్నారు.

**యూరియా కొరత తీర్చాలని వినతి**

**బి.కొత్తకోట:** రైతులకు అందాల్సిన యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోందని దీనిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు సోమవారం తహసీల్దార్ బావాజాన్‌కు వినతిపత్రం అందజేశారు. అందుబాటులోని యూరియా బస్తాపై రూ.100 నుంచి రూ.200 అదనంగా వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. వరి సాగు విస్తీర్ణం అధికం కావడంతో యూరియా డిమాండ్ ఏర్పడిందని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన మేర యూరియాను అందించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రఘునాథ్, పట్టణ కార్యదర్శి అష్రఫల్లీ, తంబయ్యశెట్టి, దుమ్ముబాబు, సోమశేఖర్ పాల్గొన్నారు.

### అగ్ని ప్రమాదాలపై అవగాహన

**కురబలకోట :** అగ్ని ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణ రక్షణ, ఆతర్వాత ఆస్తుల సంరక్షణ ముఖ్యమని మదనపల్లె ఫైర్ స్టేషన్ ఎస్ఐ శివప్ప అన్నారు. అంగళ్లు మిట్స్ యూనివర్సిటీలో సోమవారం అగ్ని ప్రమాదాలు–భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో అగ్ని ప్రమాదాల ముప్పు ఎప్పటికప్పుడు పెరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ అగ్ని మాపక భద్రతపై అప్రమత్తంగా ఉండాలన్నారు. క్యాంపస్‌లో ఎదురయ్యే ప్రమాదకర పరిస్థితిలో యంత్రాల వినియోగం, భవనాల నుంచి తరలింపు, ప్రథమ చికిత్స చర్యలు, సహాయక బృందాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక బాధ్యత, చైతన్యం అప్రమత్తత అవసరమన్నారు. అగ్ని ప్రమాద సమయాల్లో చాకచక్యంగా ఎలా వ్యవహరించాలన్న చర్యలపై ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపారు.

### జాక్‌పాట్‌లతో రైతులను దోచుకుంటున్నారు

– చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి

**గుర్రంకొండ:** గుర్రంకొండ టమాటా మండీల్లో రైతులను జాక్‌పాట్ పేరుతో వ్యాపారులు దోచుకొంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా టీడీపీ కార్యదర్శి దద్దాల హరిప్రసాద్ నాయుడు రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు వారు చేరుకొని ఆయనకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈసందర్బంగా రైతులు మాట్లాడుతూ గుర్రంకొండ టమాటా మార్కెట్‌యార్డుకు నాలుగు మండలాల నుంచి పెద్ద ఎత్తున రైతులు టమాటాలను తీసుకొస్తారన్నారు. వ్యాపారులు వంద క్రేట్లకు గానూ వేలం పాటల్లో 16 క్రేట్లు జాక్‌పాట్‌ల పేరుతో దోచుకొంటున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నాలుగు శాతం కమీషన్ తీసుకోవాల్సి ఉండగా 10శాతం మేరకు వసూలు చేస్తున్నారన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే దిక్కున్నచోట చెప్పుకోండని రైతులను దుర్భాషలాడుతున్నారని వాపోయారు. ఈసంఘటనపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

### నేత్రదానంతో చిరంజీవులు అవుతారు

**గుర్రంకొండ:** నేత్రదానం చేయడం వలన చిరంజీవులు అవుతారని జిల్లా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్‌రఫీ అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక తెలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో నేటికి 1.2 మిలియన్ల మంది కంటి జబ్బులతో బాధపడతున్నారన్నారు. కళ్లను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. కంటికి సంబంధించి ఎటవంటి జబ్బు వచ్చినా సమీప ప్రభుత్వాస్పత్రుల్లో పరీక్షలు చేసుకోవాలన్నారు. స్వచ్ఛంద నేత్రదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ కమలాకర్, టీబీ పర్యవేక్షకులు మహబూబ్‌బాషా, నాగిరెడ్డి, సీహెచ్‌వోలు మహేష్, చందన, ఏఎన్ఎమ్ జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

### 10 నుంచి మండల స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు

**మదనపల్లె సిటీ:** మండల స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు ఈనెల 10 నుంచి నిర్వహించనున్నట్లు ఎంఈఓ–2 రాజగోపాల్ తెలిపారు. సోమవారం మదనపల్లెలో సమావేశం నిర్వహించారు. పోటీలు మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల, సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పోటీలు జరుగుతాయన్నారు. మండల స్కూల్ గేమ్స్ పోటీల్లో విజేతలైన రెండు జట్లను డివిజనల్ లెవల్‌లో జరిగే స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొంటారన్నారు. అక్కడ గెలుపొందిన టీములు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.మండల స్థాయిలో వాలీబాల్,కబడ్డీ, ఖోఖో, చెస్, యోగా, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌లలో అండర్–14,17 బాలబాలికలకు జరుగనున్నట్లు తెలిపారు. అండర్–14 కేటగిరి 1.2.2012 తర్వాత పుట్టి ఉండాలన్నారు. అండర్–17కేటగిరికి 1.1.2009 తరువాత, అండర్–19కు 1.1.2007 తరువాత పుట్టి ఉండాలన్నారు. లీప్ యాప్ నందు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ నాగరాజు, డివిజనల్ సెక్రటరీ భద్రయ్య, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన అసోసియేషన్ అధ్యక్షులు నరేష్‌బాబు, పీడీలు దేవకమ్మ, అన్సర్, ఉమాదేవి, బాలాజీ, విజయకుమార్, సుదాకర్, లత, జలజ తదితరులు పాల్గొన్నారు.